# నెత్తురు మెతుకులు

రెండు సంవత్సరాలు వందరూపాయల జీతంమీద మధు మద్రాసులో ఒక ఆఫీసులో పనిచేస్తూ...తన ఆఫీసరు మనస్తత్వానికీ, తనకూ పొత్తు కుదరనందున, పై పెచ్చు ప్రతినెలా మరో ఏభై రూపాయలు ఇంటిదగ్గర్నుంచి తెప్పించుకొని...మద్రాసులో జీవనయానంచేయటం ఇష్టంలేనందున—తన జన్మస్థానానికి అతి సమీపంలో గల వూళ్లో...హైస్కూలు మాష్టరు ఉద్యోగం లభించటంతో...ఒక నూతన ఉత్సాహానికి లోనై, మధు మద్రాసులో తన ఉద్యోగానికి రాజీనామాఇచ్చి ఆ కొత్తఉద్యోగంలో చేరాడు.

బడిపంతులు జీవితంలో మధుకు ఒక నూతన జగత్తు కన్పించసాగింది. దేశానికి భావి పౌరులు కాబోయే పిల్లలకు విద్యచెప్పట మధు ఒక పవిత్రకార్యంగా ఎంచాడు. కుళ్ళిపోయి దుర్గంధం కొట్టే ఆఫీసు వాతావరణం—మధు జీవితంనుంచి నిర్గమించింది—అదే అతనికి పరమ సంతోషం. ఆఫీసు ఆవరణలోని ప్రతి వ్యక్తిలోనూ వికటాట్టహాసం చేసే సంకుచితత్వం—ఈ హైస్కూలు నాలుగు గోడలమధ్య—మచ్చుకైనా లేనందుకు మధుహృదయం మాటిమాటికి నెమలిలా నాట్యంచేసింది ఉదయంనుంచి సాయంత్రందాకా పైల్సుమధ్య కూచొని తల బద్దలుకొట్టుకునే ఆఫీసు జీవితానికి...వారంలో కొన్ని గంటలు మాత్రమే వచ్చి తనకు అభిరుచిగల విషయాన్ని పిల్లలకుబోధించటంలోనూ...ఎంతో వ్యత్యాసం వుంది.

మధు క్రొత్త ఉద్యోగంలో చేరి నెల కావస్తోంది. ప్రారంభంనుంచీ కూడా ముప్పయ్‌మంది విద్యార్థులు గల క్లాసులో గోపాలం అంటే అతనికి తెలీనిఆకర్షణ ఉద్భవించింది. అతని పేరుతోనే మధుహృదయంలో వయోభావం వరద లుగా ప్రవహిస్తుంది.

ఈ దేశంలోని కొంతరు బీదవాళ్ళ పిల్లలమల్లేనే చిరిగిన బట్టలూ, సంస్కారంలేని జుట్టూ, గాలికి కొట్టుకుపోయేశరీరం, దీంతోపాటు నల్లనిఆకారం, ఈ ఆకారానికితోడు చేతిలో పుస్తకాలసంచీ—ఇదే పదేళ్లునిండిన గోపాలానికి సంబంధించిన వివరణ.

ఈ హైస్కూలు భవన నిర్మాణానికి ఆర్థికంగా ఎంతో తోడ్పడిన... శివరామచౌదరిగారు ఈవూళ్ళోకల్లా...వూళ్ళో కల్లాఏంటి ఈపద్ధెనిమిది గ్రామాలకల్లాపేరుమోగినరైతు.ఆయన కొడుకు పేరు శ్రీనివాసరావు. అతనికి సగటున నెలకు ఐదారు వేల రూపాయల రాబడిగల డాక్టర్ కొడుకు— సీతాపతీ, జీతం, జీతంకంటే రెట్టింపు కానుకలు ఆ ప్రాంతంలోని రైతుల దగ్గర గుంజుకునే లాక్‌సూపరింటెండెంటుకొడుకు...రామా నుజం, ఆ గ్రామాన్ని ఏకఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్న మునసబు హనుమయ్యచౌదరిగారి ఏకైక పుత్రుడు వెంక టామశేషచలపతిరావు— పరమ ముఖ్యమిత్రులు. ఈ మిత్రమండలికి నాయకత్వాం శ్రీనివాసరావు ఉరఫ్ శీను (మిత్ర మండలి సభ్యుల ముద్దుపేరు) వహిస్తూవుంటాడు.

ఆ క్లాసులో ఈ మిత్ర చతుష్టయానిది ఆడింది ఆట, పాడింది పాట. రోజురోజూ రకరకాలైన విలువగల గుడ్డల్ని

ధరిస్తూ...సన్నగా తలలు దువ్వుకొని నీటుగా రాజకుమారు ల్లాగ వచ్చే ఆ మిత్రమండలికి క్లాసులోని పిల్లలందరూ అణగి మణిగి వుంటారు. గోపాలంకూడా వాళ్ళ "గొప్పతనాన్ని" గుర్తించటంలో ఆశ్చర్యంలేదు. కాని... అసలు విషయం... ఆ క్లాసులోని ఏ కుర్రాడికీ గోపాలం అంటే ఇష్టంలేదు. ఇక మిత్రమండలి విషయం వేరే చెప్పేదేముంది? వెధవ కూనారి మొహం, చిరిగి చీకిపోడే బట్టలూ, బీడయిపోయిన పొలం లాంటి తలకట్టూ... అందరికీ చీదరింపే కలుగుతుంది. వాడి ప్రక్కన కూచోటం ఎవరికీ ఇష్టంవుండదు. అధవా యధా లాభాన కూచున్నా- ముక్కులు మూసుకొని కూచుంటారు. మాష్టరు ఇటువేపు చూడనప్పుడల్లా బల్ల కిందనుంచి కాళ్ళతో రక్కుతూ వుంటారు. అదేమని నోరు మెదపటానికి వాడికి దమ్ములేల్లేవు. కిక్కురుమనకుండా అన్నిటినీ సహించాల్సిందే. ఇక మిత్రమండలి నాయకుని దృష్టిలో గోపాలం ముష్యానిసి పాలిటి మురికిడబ్బాతో సమానం. క్లాసులో మాష్టరు లేన ప్పుడూ, మధ్యాహ్నం విశ్రాంతి సమయంలోనూ...ఈ మిత్ర మండలికి గోపాలం ఒక మనోరంజకమైన విషయం.

"ఏంరా గోపిగా! నీ పేరు హాజరుపట్టీకలో 'గోపాల రావు' అని వ్రాయించుకున్నావే! ... ఎన్నినెలల కోసారి నువ్వు స్నానం చేస్తావురా ?... నీ జీవితంలో ఎప్పుడైనా తల దువ్వుకున్నావా ?... నువ్విలా అసహ్యంగా క్లాసులోకి వస్తే...మాకు జబ్బులు అంటుకోవూ ?... తలో తన్నూ తన్నండిరా వెధవని."

నాయకుని ఆజ్ఞల్ని శిరసావహించటం అనుచరబృందానికి అతి సంతోషప్రదమైన విషయం. ఒకరు జుట్టులాగితే మరొకరు చిరిగిన చొక్కాను మరింత చించటం, ఒకరు చెంప దెబ్బ వేస్తే మరొకరు వీపుమీద లగాయించి గుద్దటం—అఖరికి విజిల్ వేయడంతో పోలీస్ లాఠీచార్జి ఆగిపోయినట్లుగా ...శీను 'పోనీండిరా వెధవని' అనటంతో ఎటువాళ్ళు అటు సర్దుకుంటారు అప్పుడు శీను రంగంలోకి ప్రవేశించి... గోపిగాడి పుస్తకాలసంచిని ఫుట్ బాల్ లాగా గాలిలోకి తంతే, అతని అనుచరవర్గం మరల దాన్ని కింద పడనీయకుండా తంతూనే వుంటుంది. ఈ కాలక్షేపం అకస్మాత్తుగా ఆగిపోతుంది—క్లాసులోకి మాష్టరు వచ్చినప్పుడో, ఇంటర్ వల్ అయ్యాక బెల్ మోగినప్పుడో.

ఈ కార్యక్రమం ప్రతిసత్యాం జరుగుతూనే వుంటుంది. రోజూ గోపాలం హృదయం విషాదభరితం అవుతూనే వుంటుంది. అందరిలాగా చదువుకొని సమాజంలో ఒక సముచితస్థానాన్ని అధిష్టించాలని అతనికోరిక కావచ్చు. అందుకే ఎన్నిటినైనా సహించి...తన చదువును సాగించాలని అతని పట్టుదల.

మధుకు ఈ విషయాలన్నీ అంతుపట్టడంలో అట్టే సమయం పట్టిందికాదు. కాని గోపాలం తన విషాదభరితమైన కథను తనకు ఎప్పుడేనా వినిపించగలడేమోనని మధు ఎదురు చూశాడు. కాని, అలాంటిది జరగలేదు.

ఒకరోజున మధు స్వతహాగా శీను—తన మిత్రబృందంతో గోపాలాన్ని చుట్టుముట్టి అతని పుస్తకాల సంచిని

యధారీతిగా ఫుట్ బాల్ లాగా గాలిలోకి తంతూ చాలాసేపు కాలక్షేపం చేయటం చూచాడు.

గోపాలం దయనీయస్థితికి మధు హృదయం ద్రవీభూత మైంది. ఆ మరురోజున స్కూలుకు వస్తూన్న గోపాలాన్ని సమీపించి "నువ్వు నాతో ఎందుకు వాళ్ళమీద రిపోర్టు చేయవు? నేను ఒక్కో వెధవని చమడాలు వలుస్తాగా" అన్నాడు. గోపాలం అన్నాడు—'మీరు వాళ్ళను చమడాలు వలిస్తే...నా బతుకే భారమవుతుంది. మీ రలాచేయకండి.'

మధు కాలేజీలో చదువుకునేప్పుడు మనస్సులో రక రకాల భావాల్ని సృష్టించుకున్నాడు. ఈ సామాజిక వ్యవస్థ లోని అసమానతకు నాందిగీతం పాడే రకరకాల భావనల్ని తన మనోనేత్రం ఎదుట అల్లుకున్నాడు. అవన్నీ ఇప్పటివరకూ అలాగే పడివున్నాయి. ఒక్క భావనకు సైతం రూపం ఏర్పడలేదు.

శ్రీనివాసరావును పిలిచి అతని వ్యవహారం తేల్చుకోవా లనుకున్నాడు. అతనికి ఒక పాఠం నేర్పాలనుకున్నాడు.... కాని, మరు నిమిషంలోనే గుర్తుకొచ్చింది—తను చేసేది అరవై రూపాయల బడిపంతులు ఉద్యోగం. హైస్కూలు కమిటీకి సెక్రటరీగావున్న శ్రీ శివరాం చౌదరిగారి సుపుత్రుణ్ణి దండించే అధికారం తనకు లేనేలేదు. అలాచేస్తే తన ఉద్యోగమే ఊడిపోవచ్చు. అందుకని శ్రీనివాసరావును పిలిచి అతని వ్యవహారాన్ని గూర్చి అడగాలనే భావాన్ని మధు తన మనస్సులోనుంచి బలవంతంగా బయటికి నెట్టేసుకున్నాడు.

ఒక పవిత్రమైన పదవిని నిర్వహిస్తూకూడా—దానిలోని కలుషితాన్ని దూరంచేసేందుకు మధు హృదయం వెనుకంజ వేసింది. ఒక బలహీనతకు లోనయింది; కాని మధు వివశుడు.

మధు ఆ రోజు క్లాసులోకి వెళ్ళి పాఠం చెప్పలేక పోయాడు. అతని దృక్కులు మాటిమాటికి గోపాలాన్ని వెదుకుతున్నాయి. అతనిహృదయం గోపాలంమీద రకరకాల భావాల్ని ప్రసారితంచేస్తోంది. కాని వాటిని మాటలుగా మార్చి విద్యార్థిముందు వెదజల్లటానికి మధు మానసం ఒప్పుకోవడంలేదు. కాని ఆఖరికి తనలోపల కుతకుతలాడుతూన్న ఉత్తేజాన్ని మధు ఆపుకోలేకపోయాడు. తన ఆవేశాన్ని ఇలా వ్యక్తపరచాడు—మనం అంతా సమానం; ఒకరు బీదతనంలో కృంగి కృశించిపోవటం. మరొకరు ఐశ్వర్యంతో తులతూగటం దేశాభ్యుదయానికి ఒక పెద్ద ఆటంకం. సుఖంగా జీవించే అధికారం ప్రతిఒక్కరికివుంది. అయితే పదిమందిని కష్టాలకు లోనుచేసి—ఒంటరిగా...పదిమందిసుఖాల్ని అనుభవించటం సహించరాని విషయం.

దేశానికి భావిపౌరులు కాబోయే ఈ విద్యార్థులముందు ఒక నూతన జగత్తును సృష్టించాల్సిన అవసరాన్నిగూర్చి తెలియజేస్తున్న సమయాన—పరిహాస సూచకంగా నవ్వుతూ మధు చెప్పేమాటల్లో ఎలాంటి తథ్యంలేదని నిర్లక్ష్యతను ప్రదర్శిస్తున్న శీను హావభావాల్ని మధు సహించలేకపోయాడు. చెవు లెక్కవేసి నాలుగు చెంపదెబ్బలతో బయటికి పంపించే ఉద్దేశ్యంతో మధు గబగబా అతనిదగ్గరికి చేరేప్పటికి—శీను పుస్తకాల సంచితోసహా పలాయనం చిత్తగించాడు. కోపాన్ని

తనలో తాను దిగమింగుకొని మధు వచ్చి కుర్చీలో కూచున్నాడు.

రెండోరోజున శీను తన తండ్రిచేత ఒక ఉత్తరం వ్రాయించుకొని తీసుకొచ్చాడు—'నిన్న మీరు కుర్రాణ్ణి చెవులు మెలేసి చెంపదెబ్బలు వేశారు. వాడి చెవులూ, చెంపలూ కూడా కందిపోయాయి. ఆ దెబ్బలకు వాడికి చెవుడు రావలసింది. కాని కాస్తలో తప్పిపోయింది. ఇకముందు మీ రిలాంటి ఘాతుకకార్యం చేసేందుకు సాహసించకండి.' దానిమీద హెడ్మాస్టరు ఎర్రసిరాతో సంతకంచేశాడు.

మధుకు అమితాశ్చర్యం వేసింది—అతని కల్పనామాత్రంగానే ఇలా ఏవిధంగా సంభవించిందాఅని. దీంతో ఇక్కడి మనుషుల మనస్తత్వంకూడా మధుకు తేలిగ్గానే అవగత మయిపోయింది.

ఆ రోజున శీను తన మిత్రవర్గం సాయంతో గోపాలాన్ని పలు విధాలుగా నానా హింసలకు లోనుజేశాడు. గోపాలం కిమ్మనలేదు. కేవలం లోలోపల ఏడ్చిఏడ్చి... వూరుకున్నాడు.

'గోపాలం ఇన్ని కష్టాలకు లోనవుతూ చదువుకోటం దేనికి? మానేయకూడదూ!' అని మధు చాలాసార్లు అనుకున్నాడు. సాయంత్రం స్కూలు వదిలినాక గోపాలం—పిల్లలంతా వెళ్ళిపోయినా—అక్కడే కూచోని తను ఆరోజున తిన్న దెబ్బల్ని పరిశీలించుకుంటూ, ఫుట్బాల్లాగా ఎగరేసి తన్నిన పుస్తకాల సంచికి అంటుకున్న దుమ్ము దులుపుకుంటున్నాడు. దగ్గరగా వెళ్ళి మధు ఎంతో ప్రేమగా అడిగాడు:

'గోపాలం, నీ కష్టాల్ని నా కెందుకు చెప్పవ్! ఇన్నికష్టాలను ఎదుర్కోలేకపోతే చదువు మానేయరాదూ! మీ అమ్మా నాన్నా వీటన్నిటిని తెలుసుకోనికూడా నిన్ను స్కూలుకు పంపిస్తున్నారా?'

గోపాలం దీనంగా సమాధానం చెప్పాడు—బీదతనం అన్నికష్టాలకు మూలం. మా కష్టాల్ని తీసేయటం...ఒకరి వల్ల ఏమవుతుంది మాష్టరుగారూ?...నేను చదువుకోని... ఉదయంనుంచి సాయంత్రందాకా శ్రీ శివరాం చౌదరిగారి రైస్ మిల్లులో చెమటోడ్చి పనిచేసే మా తండ్రిని సుఖ పెట్టాలని నా కోరిక. అందుకే చదువుకుంటున్నాను. ఇక మా తల్లి విషయం. నాకు ఊహ రాకమునుపే చనిపోయింది.'

గోపాలం వెళ్ళిపోతున్నాడు. "లేదు గోపాలం. బీదతనం ఏమీ పాపంకాదు...ఇది నీకు పైకిలేచే శక్తిని ప్రసాదిస్తుంది. నేనూ బీదవాణ్ణే. నువ్వూ నేనూ కలిసి...ఈ ప్రపంచంలోని సమస్త బీదతనాన్ని రూపుమాపి...సుఖశాంతుల్ని స్థాపిద్దాం. నువ్వు నిరాశపడకు గోపాలం. కష్టాలు దూరమయితీర్తాయి"-అన్నాడు మధు. అప్పటికే గోపాలం చాలాదూరం వెళ్ళిపోయాడు.

రెండోరోజు స్కూలుకెళ్ళకుండా మధు ఇంట్లోనే కూచొని ఆలోచనలలో మునిగిపోయాడు. అతని మనోనేత్రం ఎదుట గోపాలం ఖిన్నవదనంతో నిల్చున్నాడు. అతనికి ఎలా సహాయపడాలో ఆలోచిస్తున్నాడు. అసంఖ్యాకమైన భావాలు అతని లోపల ఉప్పెనరక్తాన్ని మథిస్తున్నాయి. అకస్మాత్తుగా హెడ్‌మాష్టరు మాటలు మధుకు గుర్తుకొచ్చాయి—

'మధుసూదనరావుగారూ! మీరు క్లాసులో పాఠా లేవో చెప్పండి కాని రాజకీయాల్నిగూర్చి ముచ్చటించకండి. కమిటీ మెంబర్లందరికీ మీ భావాలు తెలిసిపోయాయి—అందుకనే నేనూ చెబుతున్నాను.' అని

ఇంకో అడుగు ముందుకు వేస్తే మధు ఉద్యోగంకాస్తా ఊడిపోతుంది. అందుకనే హెడ్‌మాష్టరు చెప్పిన మాటలు గుర్తుకు రావటంతో మధుస్కూలువేపుకువడుగెత్తుకొచ్చాడు.

విశ్రాంతిసమయం. పిల్లలంతా క్లాసుల్నించి బయటికి వెళ్ళిపోయారు. స్కూలుకు దూరంగా వుండేవాళ్ళూ, పొరుగూరునుంచి వచ్చేవాళ్ళూ భోజనం తెచ్చుకొని ప్రక్కనే వున్న తోటలో తలోచోట కూచొని తింటున్నారు. అటు దృష్టి మరల్చటంతో—మధుకు అకస్మాత్తుగా...ఒక మూల కూచొని ఒక చిన్న జర్మన్ సిల్వర్ గిన్నె ముందుంచుకొని తింటూన్న గోపాలం కన్పించాడు. ఇంతకుమునుపే ఇంటిదగ్గర అవిరళంగా ప్రవహిస్తూన్న తన ఆలోచనల ప్రవాహాన్ని—మరోవేపుకుతిప్పాడు. ఇప్పుడు గోపాలం కన్పించటంతో మరల పూర్వపు మార్గంలోనే అతని భావనలు పరుగిడసాగాయి.

కాని, విచిత్రమేమంటే గోపాలం ఏదో తింటున్నట్లు నటిస్తున్నాడేగాని...ఆ గిన్నెలో ఏమీ లేదు. తనుకూడా అందరితోపాటు తింటున్నానని తన తోడిపిల్లల్ని మభ్యపెట్టడం గోపాలం ఉద్దేశ్యం కావచ్చు. కాని, మధుకు తెలిని దుఃఖం ఉద్భవించింది. ఏదో అడగాలని అనుకుంటూ వుండగానే అటు వేపునుంచి నవ్వుతూ కేరింతలు కొడుతూ వచ్చే శీనుమిత్ర బృందం కన్పించింది. మధు ప్రక్కకు ఒదిగి గోడప్రక్కన

నిల్చున్నాడు.

'ఒరేయ్. గోపీగాడు ఈ మూలన నక్కి కూచున్నాడు. ఏదో గిన్నె ముందున్నది చూడండిరా.' అని శీను అనటం తోటే... తక్కినవాళ్ళంతా—ఒకడు జుట్టులాగగా మరొకడు చొక్కా పుచ్చుకొని గుంజుతున్నాడు. ఇంకోడు నడుం వాటేసుకున్నాడు. 'గోపిగాడు ఈ చిన్ని గిన్నెలోనే పంచ భక్ష్య పరమాన్నాలు తెచ్చుకొని తింటున్నాడల్లేవుంది. నాక్కూడా కొంచెం పెట్టరా గోపిగా' అని శీను నిల్చున్న గోపాలాన్ని ఒక్క తన్ను తన్నాడు. ఆ తన్నుతో వాడు అంతదూరాన పడ్డాడు. పెదవి చితికింది. చెయ్యిపోయి తన గిన్నె అంచుమీద పడటంవల్ల చిట్లి రక్తం దాంట్లోకి జలజల కారుతోంది. పెదవినుంచికూడా రక్తం చిమ్ముతోంది. శీను అదేమీ చూడకుండా—'ఒరేయ్! గోపిగా! నువ్వు నాకు ఏమీ పెట్టవద్దులేరా, నేనే నీకు పెడతాను...నీకోసం ప్రత్యేకంగా వండించుకొచ్చాను.' అని శీను తన టిఫిన్ కారియర్‌లో తను తినగా మిగిలింది---గోపాలంమీద గుమ్మరించాడు.

యుగయుగాలనుంచి ఆకలితో అలమటిస్తూ వికవిక లాడిపోతున్న...వ్యక్తికిమల్లేనే గోపాలం శీను గుమ్మరించిన మెతుకుల్ని...పెదవినుంచీ, చేతినుంచి కారే రక్తంతో సిక్తమైనప్పటికీ వాటినే పోగుచేసుకొని తింటూ వికృతస్వరంతో గోపాలం అన్నాడు—"శ్రీనివాసరావూ, నువ్వు నాకు అన్నం పడేశావు; దాన్ని నేను తింటున్నాను. దానికి బదులుగా ఈ గిన్నెలో నిండిపోయిన నా మధుర రక్తం చవిచూడు. మీ నాన్న చేసేదికూడా ఇదేకదా...మిల్లులో పనిచేసే

అసంఖ్యాక కూలిజనానికి ఇలాగే నాలుగు మెతుకులు పడేసి వాళ్ళ రక్తాన్ని చాలా మధురంగా పానంచేస్తుంటాడు. చెమటోడ్చి పనిచేసేవాళ్ళరక్తం చాలా తియ్యగా వుంటుంది' ఆ తరువాత ఏం జరిగిందో మధు చూడలేదు. కొన్ని నిమిషాల క్రితమే అతను టీచర్స్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

రెండోరోజున గోపాలం స్కూలుకు రాలేదు. శ్రీ శివరాం చౌదరిగారి రైస్‌మిల్లులో పనిచేసే గోపాలం తండ్రి ప్రమాద స్థితిలో వున్నాడు. రాత్రింబవళ్ళు పనిచేయటంవల్ల అతనిలో రక్తం వుడిగిపోయిందని డాక్టరు చెప్పాడు. మరి రెండురోజులకు గోపాలం తండ్రి తెల్లబడిపోయాడు. ఇక రేపో మాపో అనే స్థితిలోవున్నాడు. గోపాలం చదువు మానేసినట్లే శ్రీ శివరాం చౌదరిగారి రైస్‌మిల్లులో తన తండ్రి స్థానంలో గోపాలం పని చేస్తాడు. ఏదో ఒక రోజుకు గోపాలం పెద్దవాడయి పెళ్ళిచేసుకుంటాడు. వాడికో కొడుకు పుడతాడు. ఏదో ఒకరోజు గోపాలంలోని రక్తం ఉడిగిపోతుంది. మరికొన్నిరోజులకు తెల్లబడిపోతాడు...అంతే. శ్రీశివరాం చౌదరిగారి సుపుత్రుడు... హైస్కూలు చదువూ కాలేజీ చదువూ ముగించుకొని... పెద్ద చదువులకోసం అమెరికా వెళ్తాడు.

తిరిగివచ్చి...కొత్త పద్ధతులతో కొత్త యంత్రాలతో మరికొన్ని మిల్లుల్ని స్థాపిస్తాడు. అతని కొడుకు గోపాలంలాంటి మరో నిర్ధనుడి పుస్తకాలసంచిని ఫుట్‌బాల్‌లాగా తంతాడు. వాడికి నెత్తురు మెతుకులు ప్రసాదిస్తాడు తనసాంప్రదాయాన్ని నిలబెడతాడు...ఇలా ఈ క్రమం సాగిపోతూనే వుంటుంది...

కానీ......చివరకు ?